# బిర్లామందిర్

చందు

ఆ రోజు ఆదివారం, రోజువారి రొటీన్ జీవితం ఉరుకులు పరుగుల మధ్య ఏ ఆలోచనలు చుట్టుముట్టకుండా మిగతా ఆరు రోజులు పరుగెత్తుతాయి కాని ఆదివారం కనిపించని అసంతృప్తుల నీలి నీడలు తచ్చాడుతాయి. స్పష్టంగాని ప్రశ్నలు వెంటాడుతాయి. అందరికీ ఏమోగాని ఆదివారం మునిమాపు పడుకొని లేచినట్లుగా అస్పష్టంగా గ్లూమిగా ఉంటుంది. మా ఆవిడకు మిగతా రోజుల్లో మా అందరితో పాటే హడావిడి. ఈ రోజు మా ఇద్దరు పిల్లలు, నేను ఇంట్లోనే ఉండడంతో అదనపు పనులు ఇలాంటి గ్లూమి ఆదివారం తప్పించు కోవడానికి చేసే ప్రయత్నాలు నెలకో మారు మాత్రమే సాధ్యమౌతాయి.

గత రెండు వారాలుగా ఇల్లువదిలి ఎటు కదలకపోవడం వల్ల పిల్లలకు మరీ ముఖ్యంగా మా ఆవిడకు కొంత బోరుగా ఉందేమొ ఈ రోజు ఏదన్నా ప్రోగ్రాం పెట్టుకుందామని నిర్ణయించారు. అయితే ఏ ప్రోగ్రాం పెట్టుకుందామన్న విషయంలో కొంత తర్జన భర్జన జరిగిన తర్వాత పిల్లలు మా ఆవిడ ఆరోజు సాయంత్రం బిర్లా మందిర్‌ను దర్శించి వెంకటేశ్వరస్వామిని మొక్కుకుందామని తీర్మానించారు. వాస్తవానికి నేను హైద్రాబాదు ఉద్యోగరీత్యా వచ్చి అప్పటికే రెండు సంవత్సరాలు దాటిపోయాయి. మేము ఉండేదేమో మూసాపేటలో, నాకు అక్కడ దగ్గరగా ఉండే ఫ్యాక్టరీలో ఓ చిన్న పాటి సూపర్ వైజరు ఉద్యోగం. నేను పాలిటెక్నిక్ చేసిన పది సంవత్సరాల తర్వాత చిన్న పెద్ద ఉద్యోగాలు, అక్కడక్కడ పర్మినెంటు కాని పనులు చేశాను. కొంత వరకు పనిచేసిన కాడ పరిస్థితులు, జీతం నచ్చక మరికొన్ని చోట్ల టెంపరరీ ఉద్యోగాల కాలపరిమితి తీరిపోయి తీసేయగా మళ్ళీ మళ్ళీ నిరుద్యోగినై చివరికి క్రింద మీద పడి ఇప్పుడు చేస్తున్న ఫ్యాక్టరీలోకి వచ్చిపడ్డాను.

రెండు గదుల కిరాయి కొంప. ఉన్నంతలో గుట్టుగా సంసారం సాగించే ఇల్లాలు. మోపెడు పుస్తకాలతో చిలుక పలుకుల్లా వచ్చీరాని ఇంగ్లీషు కాన్వెంటులో చదివే పిల్లలు బొటాబొటిగా అవసరాలకు సరిపోతున్న జీతం. ఈ రెండేళ్ళ కాలములో దాచుకోగలిగింది ఏమిలేకున్నా ఈ మాత్రం బ్రతుకు తెరువు ఎందరికుందని ఆలోచించినప్పుడు మేము సుఖంగా బ్రతుకుతున్నామనే నాకునేను పదే పదే సర్ది చెప్పుకుంటుంటాను.

మధ్యాహ్నాల వరకు ఇంట్లో మా ఆవిడకు ఇంటిపని వంటపని, పిల్లలబట్టలు ఉతకడం, వాళ్ళకు తలంటి స్నానం చేయించటం, ఫోంచేయటం అన్నీ అయిపోయినవి. పిల్లలు పెద్దింగు పని హోంవర్క్ కూడా పూర్తి చేసుకున్నారు. ఎలాగు సాయంత్రం బిర్లామందిర్‌కు పోదామని నిర్ణయించుకున్నాం కాబట్టి అంతవరదాక కొంత విశ్రాంతి తీసుకుంటేనే బాగుంటుందనుకొని నిదురకు ఉపక్రమిస్తుంటే మా చిన్నబ్బాయి దగ్గరికి వచ్చి "నాన్న నాకు ఇవ్వాల క్రికెటుబ్యాటు కొనియ్యాలి తప్పకుండా" అంటూ గోముగా మారం చేసిండు. "క్రికెటు బ్యాటు పొడుగు లేవు నీకెందుకురా" అన్నాను. వాడు అదేమి పట్టించుకోకుండా "నాక్కావాలి" అంటూ పట్టి పట్టి కూని రాగాలు మొదలు చేశాడు

ఇక వాన్ని ఎలా సముదాయించాలో అర్థంకాని స్థితిలో మా ఆవిడ వాన్ని సంకన ఎత్తుకొని "సరె లేరా వచ్చేటప్పుడు అలాగే కొనిస్తాం" అంటూ తీసుకు వెళ్ళింది. నేను మెల్లగా నిదురలోకి జారుకున్నాను.

సాయంత్రం నేను నిదరలేచేసరికి పిల్లలు మా ఆవిడ తయారై బిర్లా మందిర్ పోవటానికి సిద్ధంగా ఉన్నారు. నేను లేచి ముఖం కడుక్కొని బట్టలు మార్చుకొని మరో పావుగంటలో తయారై, అందరం బయలు దేరాము.

సాయంత్రం ఆదివారపు సందడిలో హైద్రాబాద్ సిటిబస్సులో మేం నలుగురం ఎక్కి గంట సేపు ప్రయాణం చేసేసరికి చమటతో తడిసి బట్టలు నలిగి పోయి, ఊపిరి సలుపకుండా అయిపోయి, బస్సుదిగేసరికి చల్లగాలి మెల్లగా తాకి పోయిన ఊపిరి మళ్ళీ వచ్చినట్టుగా అనిపించింది.

ఉరుకులు పరుగులతో అనంతమైన జనప్రవాహం పరస్పర విరుద్ధమైన పెక్కు జీవితాలకు నిలయం. ఆకాశ హర్మ్యాలకు పేద పూరిళ్లకు స్థావరం ఈ నగరం. అందమైన మెర్క్యురీ దీపాల కాంతులు ఒకవైపు, మరోవైపు అనంతమైన చీకటి బ్రతుకులు. ఇవేవి పట్టనట్టుగా నిర్లిప్తంగా ఎవరో 'కీ' ఇస్తే ఆడే మర బొమ్మల్లా నిరంతరం పరుగులు పెట్టేజనం. నాకు ఎప్పుడు అర్థంకాని వింత పదార్థంలా కనబడే భాగ్యనగరం.

ట్యాంకు బండ్ మీద మహామహుల శిలాప్రతిమలు. బ్రతికి ఉన్నప్పుడు వీళ్ళు ప్రపంచాన్ని తమ వెంటనడిపించిన మహానుభావులు, ఇప్పుడెందుకో చేతలు

ఉడికి పోయి నిశ్చేష్టులైపోయి శిలాప్రతిమల్లా నిలబడి మూగగా రోదిస్తున్నట్టుగా ఉంది. హుస్సేన్ సాగర్ మురికి వాసనల మధ్య బందీలుగా నిలబడి పోయినట్లని పించింది.

నగరం నడిబొడ్డున టాంకుబండను వొడ్డాణంగా చుట్టుకున్న నగరం కురుల్లో ముడిచిన తెల్లమల్లెలుగా బిర్లామందిరం కాంతులీనుతుంది.

ఈ రెండ్ల కాలములో బిర్లామందిరానికి రావటం ఇది రెండవసారి. తెల్లగ ధగధగ లాడే పాలరాతి మందిరం నాకు బిర్లాల కళాతృష్ణ, భగవద్భక్తిని గుర్తు చేస్తుంది. ఆదివారం సాయంత్రాల్లో మరింత సందడిగా ఉండే బిర్లామందిరంకు సీతాకోక చిలుకల్లాంటి రంగురంగుల బట్టల్లో వయ్యారంగా కులుకుతు నడిచి వచ్చే జంటలు. బుగ్గలు చిదిమితే పాలుకారే ఎర్రటి ముద్దబంతుల్లాంటి పిల్లల కేరింతలు. భక్తి పారవశ్యంతో పరవశించిపోయే ముసలివారు. అందరు ఏదో తెలియని తన్మయత్వంతో మునిగి పోయినట్లుగా గుంపులు గుంపులుగా కదిలి ముందుకు పోతున్నారు.

మా ఆవిడ క్షణం సేపు ఆగి కొబ్బరికాయ కొన్నది పిల్లలు బొమ్మల దుకాణంలోని వివిధ రకాలైన వింతైన బొమ్మలను ఇంతింత కనులు చేసి చూస్తు ముందుకు కదిలారు.

ఇంత ఆనందకరమైన వాతావరణంలో చీకటి మరకల్లా మెట్లకు రెండు వైపులా బారులు తీరి పదిపైసల కోసం దేబిరించే ఎండిపోయి గోరంత మాంసము లేని క్షుద్బాధ పీడితులు మిగిలిపోయిన తమ యావత్‌శక్తిని కళ్ళలో నింపుకొని పది పైసల ధర్మం కోసం దీనంగా అరిచే అరుపులు. అవి చూస్తే నా కడుపు తరుక్కుపోతుంది నా కడుపులో చెయ్యేసి దేవినట్టుగా అతలాకుతలం అయిపోతుంది. అందుకే అటువంటి చోట్లకు పోవాలంటే నాకెందుకో భయంగా ఉంటుంది. నేను వారివైపు చూడకుండా ఉండటం కోసం నా దృష్టిని ఎంత మళ్ళించుకున్నా సాధ్యం కాదు.

అదేదీ పట్టించుకోనట్టుగా నేను ఏమీ చూడనట్టుగా గబగబా వారిని దాటేసు కుంటు ముందుకు పోతున్నా, నాకండ్లనుండి ఏ భిక్షగాళ్ళు తప్పించుకోలేక పోతున్నారు.

మందిరపు పాలరాతి చివరి మెట్టుకాడ నిస్సారమైన చూపులతో మా[illegible]కు

లేకుండా కూర్చున్న బిక్షగాని మీద దృష్టి పడింది. అతని గడ్డం పెరిగున్నది. బట్టలు చెరిగిపోయి అట్టుకట్టుక పోయినాయి ఏండ్ల తరబడి స్నాన పానాదులు లేకుండా జడలు కట్టిన జుట్టు జబ్బల వరకు పెరిగి ఉంది. అతని లోతైన కన్నుల్లో ఎక్కడో సుదూరంగా గత స్మృతిని నెమరు వేసుకుంటున్నట్టుగా చూపులు నిలబడి పోయినవి. అతను ఎవరిని దేబిరించడం లేదు. అతని ముందు పరిచి ఉన్న మురికి గుడ్డమీద కొన్ని చిల్లర డబ్బులున్నాయి.

అడుక్కోవడం ఇష్టం లేనట్టుగా అయినా అడుక్కోక తప్పనట్టుగా అతని మొఖం చూస్తే అనిపించింది. జేబులో పది పైసలు తీసి అతని ముందున్న గుడ్డలో వేశాను.

ఒక్కసారిగా అతని గాజు కళ్ళను తిప్పి నా మొఖంలోకి చూసాడు. ఆ కళ్ళను చూస్తుంటే ఎందుకో నాకు గతంలో అతన్ని ఎక్కడో చూసినట్టుగా అనిపించింది. కాని ఎక్కడ? ఎప్పుడు? చూసింది గుర్తుకు రావటం లేదు. నా దృష్టి మళ్ళించుకొని ముందుకు కదిలాను అయినా అతని చూపులు నన్ను వెంటాడుతున్నట్టుగానే అనిపించింది.

యాంత్రికంగా ముందుకు కదిలినా నా అంతరంతరాల్లో అతన్ని ఎక్కడ చూసానబ్బా అంటు వెతుకులాట మొదలయింది. అందమైన పాలరాతి మందిరము పైన, శ్రావ్యంగా వినిపించే సంగీతంపై నా మనసు నిలవటంలేదు. బిర్లా మందిరం నుండి కనిపించే నాలుగు దిక్కులుగా ప్రాకిన నగరం అందచందాల మీద దృష్టి మల్లటంలేదు. నా కళ్ల ముందు అవే చూపులు నిలిచి పోయినట్టుగా అనిపించసాగింది.

దైవ దర్శనం అయిపోయింది. నా ముఖావాన్ని చూ ఆవిడ పసిగట్టినట్టుంది

"ఎమైంది" అంది.

"అబ్బే ఏం లేదు" అంటూ దాటవేసాను.

ఆమెకు నా సమాధానం సంతృప్తి కల్గించినట్టులేదు.

"వెళ్ళిపోదామా" అంది

"సరే" అన్నాను.

వెనక్కి మళ్ళాము. అదే చివరి మెట్టుమీద అతను అదే చోట కూచొని ఉన్నాడు. అతన్ని గుర్తించటంకోసమన్నట్టుగా అతను నా కళ్ళకు కనుమరుగ

ద్యేంత వరకు మళ్ళీ మళ్ళీ చూసాను. అయినా అతన్నెక్కడ చూశానో గుర్తుకు రావడంలేదు.

పిల్లలకు నా ముఖభావం నచ్చలేదు "నాన్నా నా బ్యాటు" అంటు మా చిన్నవాడు అడిగాడు.

ఇవ్వాళ ఆదివారం కదా "దుకాణాలు బందుంటాయి. నేను రేపు డ్యూటీనుండి తిరిగి వచ్చేటప్పుడు తెస్తాను" సముదాయించాను.

వాడు కాస్త మారాం చేసి మౌనం వహించిండు.

బస్సుస్టాపు వరకు ఆటోలో పోతే అక్కడినుంచి లోకల్ బస్సులో పోతే అనుకూలంగాను, ఆదాను ఉంటుంది. రోడ్డు వారగా ఆగిన ఆటోలో కూచొని పలానా బస్సుస్టాపుకు పోనివ్వన్నాను. ఆటో కదిలింది

నేను మౌనంగా ఉండటంతో మా ఆవిడ కూడా మౌనంగా ఉండిపోయింది పిల్లలు కదిలే వాహనాలను చూస్తున్నారు. ఆటో వేగం అందుకుంది

అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది.

సరిగ్గా ఎనిమిది సంవత్సరాల క్రింద పాలిటెక్నిక్ డిప్లొమా చేసి ఉద్యోగం కోసం వేట మొదలుపెట్టిన కొత్తలో మొదటి సారిగా కాల్ లెటర్ వచ్చింది. ఉద్యోగం టెంపరరీది, అయినా మొదటగా వచ్చిన అవకాశం కావటంతో ఆ అవకాశాన్ని జారవిడుచుకోవద్దని కొంత, ఉద్యోగం చేయాలనే ఉత్సకతతో ఇంటర్వ్యూకు హాజరు అయినాను. నెలకు నాల్గువందల స్టయిఫండు హాస్టల్ వసతి ఉండటంతో ఆ ఫ్యాక్టరీలో చేరిపోయినాను.

ఆ ఫ్యాక్టరీ ఒక బట్టలమిల్లు. ఆ ఫ్యాక్టరీలోనే కపుడాఖాతా (బట్టలు నేసే సెక్షన్)లోనే అతను పనిచేసేవాడు. అప్పటికి అతనికి పదిహేను సంవత్సరాల సర్వీసు మంచిపనివాడుగా పేరున్నది.

మిషనుమీద చేయ్యేసి దాని కదలికనుబట్టి మంచి చెడులు నిర్ణయించేంత నైపుణ్యం ఉండేది. నిరంతరమైన పనిలో శ్రద్ధ, ధ్యాస అతనికి ఆ నైపుణ్యం అందేలా చేసింది. అందుకే అతనికి అందరిలో ఓ ప్రత్యేకత గుర్తింపు ఉండేది. పైగా మంచి మనిషి, సాత్వికుడు. తాను తనపని కుటుంబం ఇంతే అన్నట్టుగా గడిపేవాడు.

నేను పనిచేసే సెక్షన్‌లోనే అతను పని చేయడంతో అతనితో పరిచయం

పెరిగింది. అందులోను అతను ఉండేది కూడా నేను ఉండే హాస్టలుకు ఎదురుగా కార్మికులు నివసించే గుడిసెల ప్రాంతము కావటంతో డ్యూటీ నుండి వచ్చేటప్పుడో, పోయేటప్పుడో ఇద్దరం కలిసి పోయేవాళ్ళము. ఆ విధంగా మరికొంత పరిచయం పెరిగింది.

ఆ పరిచయంతోనే ఒకరోజు వారి ఇంటికి ఆహ్వానించాడు.

చాల చిన్న ఇల్లు సరిగా మాలాగే అప్పుడు అతనికి ఇద్దరు పిల్లలు స్కూల్లో చదివేవారు. అతని భార్యకూడా చాల అనుకూలవతి. అన్యోన్యమైన చిన్న సంసారం వారిది. వారితో మాట్లాడితే ఆత్మీయులను కలిసినంత సంతోషంగా ఉండేది గౌరవం కల్గేది

ఆ తర్వాత కొన్ని నెలలకు నేను ఆ ఉద్యోగం వదిలేసి వేరే ఉద్యోగంలోకి వెళ్ళిపోయాను. అక్కడక్కడ తిరిగి చివరికి ఇక్కడికి వచ్చాను. అయితే ఈ మధ్య కాలంలోనే ఆ ఫ్యాక్టరీని యజమాన్యం మూసేసిందని పేపర్లో చదివాను.

నలభై ఏండ్లుగా నడిచిన ఫ్యాక్టరీ మూతపడి పోయింది ఆ ఫ్యాక్టరీ మీద వచ్చినలాభాలతోనే బిర్లా ఆ ప్రక్కనే మరో ఫ్యాక్టరీ కట్టేడు ఇంకా కొన్ని కొత్త ఫ్యాక్టరీలు నెలకొల్పిండు పట్టిపోయిన అవులాంటి పాత టెక్నిక్‌తో నడిచే ఆఫ్యాక్టరీ వల్ల ఇక లాభాలు వచ్చే అవకాశం లేదని తెలిసిన తర్వాత దాని యజమాని నిర్దక్షిణ్యంగా ఫ్యాక్టరీకి లాకౌటు ప్రకటించాడు. లాకౌటు ప్రకటనల్లో మేనేజిమెంటు చూయించిన కారణాలు ఏవి సక్రమంగా లేవని లేబరు కోర్టు తీర్పు ఇచ్చింది.

ఐదు వేలవంది కార్మికులు జీవనోపాధి కోల్పోయి పెండ్లాం పిల్లలతో వీధుల పాలయ్యారు. ఆకలిచావులు, ఆత్మహత్యలతో, అంతా అతలాకుతలం అయి పోయింది. కార్మికుల జీవితాలు చెల్లాచెదరయి అయిపోయాయి కాన్వెంటులో చదివిన పిల్లలు వీధుల్లో ఆకలికి అలమటించిపోతూ అడుక్కుతింటున్నారు. ఆ బాధలు చూడలేని తండ్రులు ఫ్యాక్టరీ గేటు ముందున్న చెట్టుకు ఉరివేసుకున్నారు.

స్వచ్ఛంద సంస్థలు గోలమన్నాయి. పత్రికలు కథలు కథలుగా వారి కన్నీటి కథను ఏకరువు పెట్టాయి. కేంద్ర రాష్ట్ర మంత్రులు వచ్చారు, ఫ్యాక్టరీని తెరిపిస్తామని తియ్యటి కబుర్లు చెప్పి ఓట్లు దండుకు పోయారు. ఫ్యాక్టరీ యజమానులు పోషించిన యూనియన్ నాయకులు గట్టు చప్పుడు కాకుండా ఎదిగిపోయి రాష్ట్రంలో మంత్రు అయి పోయారు.

272

ఏ చట్టం ఫ్యాక్టరీ యజమానిని శిక్షించలేదు. ఏ నీతి, ఏ ధర్మం ఐదువేల కార్మిక కుటుంబాలను ఆదుకోలేదు.

నేను అక్కడ కొన్నిరోజులు పనిచేయడంవల్ల ఆ ఫ్యాక్టరీలో జరిగిన మార్పు అన్నీ నా మనసులో నాటుకుపోయాయి. ఇదంతా గుర్తుకు వచ్చి నా మనసంత అతులా కుతలం అయిపోయింది

ఆటో బస్సుస్టాపులో ఆగింది.

ఎందుకో అతన్ని కలవాలనే బలమైన కోరిక బయలు దేరింది. ముషాపేట బస్సులో పిల్లలను, మా ఆవిడను ఎక్కించి మరోగంటలో వస్తాను నాకు కొంచెం పనుంది అని మా ఆవిడకు చెప్పాను.

బస్సు కదిలింది. నేను ఆటో తీసుకొని మళ్ళీ బిర్లామందిర్‌కు పోయాను. గబ గబ అడుగులు వేసుకుంటూ మెట్లమీద పరుగులు పెడుతూ అతని కోసం వెతక సాగాను.

ఆ చివరి మెట్లువరకు వెళ్ళాను. కాని అతను అక్కడ కన్పించలేదు. ఏదో పోగొట్టుకున్న వాడిలా అక్కడంతా వెతికాను. ఎక్కడా కనిపించలేదు. నా ఆతృత ఆపుకోలేక పోయాను. అక్కడున్న మిగితా భిక్షగాళ్ళను అడిగాను.

"ఇక్కడో సర్‌సిల్క్ కార్మికుడుండాలి ఏమైండు" అని అడిగాను

నా ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు. నేను మళ్ళీ మళ్ళీ ఒకటికి పది సార్లు అడిగాను. ఎవరు చెప్పలేదు.

నా వొంట్లోని రక్తాన్ని చేవను ఎవరో పీల్చిపిప్పి చేస్తున్నట్టుగా అనిపించ సాగింది. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నీళ్ళునిండిన కళ్ళతో ఒక్కసారి బిర్లామందిరం కేసి చూసాను

ఎందుకో ఆ తెల్లని పాలరాతి మందిరం ఐదువేలమంది సర్‌సిల్క్ కార్మికుల కుటుంబాల ఎండిపోయిన శవాలను పేర్చికట్టినట్టుగా నెత్తురోడుస్తూ ఎర్రగా అప్పుడే చిమ్మిన రక్తంలా కనిపించసాగింది.